## గొప్పవారితో గుసగుసలు-3. కలియుగ చక్రవర్తులు:

# చరితాదేవి

కి॥ శే॥ వారణాసి శ్రీనివాసరావు

[హిమవంతంలో నొక జలపాతం దగ్గర గూర్చుని ధ్యానిస్తూన్న నన్నొక అపూర్వమైన స్త్రీవ్యక్తి సమీపించి, లేచి నమస్కరిస్తూన్న నన్నాశీర్వదించి—]

స్త్రీ ఏమయ్యా, మమ్మల్నుపాసించావ్. దేవి, చరితాకాంతా, వెళ్లిరావమ్మా అంటే వచ్చాం. మాతో నీ కేం పని వచ్చిందయ్యా!

నేను: తల్లీ, ఒక గొప్ప సందేహ మొచ్చి తమ కీ శ్రమ యిప్పించాల్సివచ్చింది. దేవికి నామీద నున్న అభిమానానికి నే నెన్నటికీ కృతజ్ఞుణ్ణి.

చరితాదేవి: ఏమి టా మహాసందేహం? మీ కాలంవాండ్లకందని,విచ్చని సందేహాలున్నాయా ప్రపంచంలో—సృష్టిసందేహ మొకటితప్ప! దాన్నిగూడా విడిదీస్తున్నా మంటారుగా?

నే ఏమిటోనమ్మా, మా శశభిషలు! అహంకారాని కంత మెక్కడ! చిత్తం. ప్రకృతం చివరమౌర్యుడుతర్వాత గుప్తవంశం వారు రాజ్యాని కొచ్చిందాకా మన చరిత్రనడ కేమిటాని?

చ మీకాలంవాండ్లకు మే మేం జెప్తే పని కొస్తుందయ్యా? మీ కంతా ప్రత్యక్షప్రమాణాలు, నిదర్శనాలు—కాకుంటే వాటిని రూపించే అప్రత్యక్షప్రమాణాలు. నిదర్శనాలు కావాలిపాయ్! ఏ శిథిలాలలో, శాసనాలలో, నాణాలలో స్వదేశీయుల సమకాలపువి కాని, తర్వాతివిగాని వ్రాతలో, విదేశీయుల వ్రాతలో మొదలైన ఆధారాలు కావాల్సొచ్చె మీకు. పురాణాలు పనికిరానైపాయ్, అట్లాటివా ళ్ళెక్కణ్ణుంచి తేము! మీపూర్వులకు మీచరిత్రజ్ఞానవిన్యాసం లాక అట్లాటివాటిని ప్రతివిషయానికి యేర్పరచకపోయిరి. అథవా యెవరైనా యేదైనా వ్రాసినా దాన్నంతా సోదరిని, కవిత్వము, నమ్మదగ్గది కాదని విమర్శిస్తారెపాయ్! మే మేం జేయగలం? అయినా, యిపుడు నీ వడిగిన అర్థం పురాణాల్లో లేదూ? చివర మౌర్యుణ్ణి పుష్యమిత్రసంగు డనే బ్రాహ్మణసేనాని వధించి రాజ్యాని కొచ్చాడని, ఆయన వంశీయుల్లో చవరవాణ్ణి చంపి కణ్వాయను డనే మరొక బ్రాహ్మణసేనాని రాజ్యాని కొచ్చాడని, ఆయన వంశీయుల్లో చివరరాజును జంపి ఆంధ్రప్రభులైన కుంతలశాతకర్ణి రాజ్య మేలడ మారంభించాడని, సంగులు, కణ్వాయనులు, ఆంధ్రులు అంతా మౌర్యభృత్యుల మని పిలుచుకున్నారని పురాణా లైపుతున్నాయిగా—ఆ ఆధారాలాలవూ? ఆంధ్రులు పాటలీపుత్రంనుండి మూడు వందలేండ్లు రాజ్య మేలారని, వారికాలంలో శాక్యులతాకిడి వచ్చి దేశంలో కొంత కల్లోలస్థితి యేర్పడ్డదని, తర్వాత చరిత్ర కొంతకాలంవరకు సరళంగానే జరిగిందని, జరుగుతుండగా గ్రీకుల దండయాత్ర లొచ్చాయని, దేశం వాటిని సర్దుకుని కాలక్షేప మారంభించేవరకు హూణుల దండయాత్ర లొచ్చాయని పురాణాల్సరిగ్గా చదివితే తెలీదూ?

నే: అదంతా, యెప్పట్నుం చెప్పటికొని, మా రంధి.

చ: (నవ్వి) ఈ రంధొక మహాబాధాకరమైన విషయం దీన్ని గురించొక్క టంటాం విను. ఒక విషయం ఫలానప్పుడు జరిగిందని తెలీడంవల్ల నయ్యే జ్ఞానాభివృద్ధేది? ఒకడు పుట్టింరోజు, మృతి పొందిన్రోజు పుట్టిన్రోజు పండక్కు తద్దినాలకు కర్మభూమి కాబట్టి పనికొస్తుంది గాని, ఒకటొకప్పుడు జరిగిందనే దాన్లో విషయం జరగడం ప్రధానమూ, దాని తిథివారనక్షత్రాలు ప్రధానమా? అప్పటికి మహాపురుషులు జయంత్యాదివిషయాలకు తిథివారనక్షత్రా లేర్పడేవున్నాయ్‌గా ప్రతిస్వల్పవిషయ మిప్పుడిప్పుడు జరిగిందని యెరుగుండడపు దురద మీకీ పాశ్చాత్యసంపర్కంతో బుట్టింది వాండ్ల వ్యవహారమంతా నిన్నగాక, మొన్న పుట్టింది కాబట్టి ఇదిప్పుడు జరిగిం దని తేల్చుకు వ్రాసుకోవడానికి వాండ్ల కవకాశం గలిగింది. ఈ దేశ చరిత్ర షుమారు రెండువందల కోట్ల సంవత్సరాల్నాట్నుంచి జరుగుతూంది. దాన్లో ఫలానా ఫలానా విషయా లెప్పుడెప్పుడు జరిగాయో నిర్ణయించే దెట్లా—ఆకాలంవాండ్లకు కాలనిర్ణయాభిమానం లేనప్పుడూ? అవి యేవో తెలిస్తే చాలదూ? వాటి కాల నిశ్చయం లాకుంటే మునిగిపోయిం దేమిటీ?

నే అ దేమిటి, తల్లీ అట్లాగంటారూ! ఇదిప్పుడు జరిగింది, అదప్పుడు జరిగిందీ అని చక్కగా ఒక పటంమీద వేసి చూస్తే స్పష్టంగా తెలుస్తుందిగా?

చ ఆ మీకాలంలో రోగులకు చికిత్స జ్ఞేసే వైద్యులు ఇప్పుడింత జ్వర మొచ్చింది. ఇప్పుడీ పథ్య మిచ్చామని పటాల్తయారుచేసి చికిత్స నడిపించేట్లు! అది జాడ్యం గాబట్టి యేమాత్రపు జాగ్రత్త జరిగినా, ప్రాణంమీదికొస్తుందని తయారుచేయడ మందం, చందంగాని చరిత్ర విషయాల కట్లాటి జ్ఞాన మెందుకోయ్?

నే: అయితే తామ సెలవిచ్చే దేమిటి?

చ: ఏముందీ, నీ వేదో అడుగుతూంటే చర్చించాం తప్ప!

నే చిత్తం. నాసందేహనివృత్తి?

చ: పురాణాల్జూడు, నీసందేహం నివర్తిస్తుంది. మౌర్యులతర్వాత వెవడెవ డొచ్చిందీ తెలుస్తుంది వాండ్లలో వందలసంవత్సరాల పర్యంతం రాజ్యా లేలినవాండ్లకు శతాబ్దకాల నిర్ణయ ముంటుంది. తక్కువవాండ్లకు పురుషులుంటారు నీ కా కాలనిశ్చయపు రంధుంటే, ఉజ్జాయింపున పురుషాంతరాల్ను గణించుకుని ఆవంశంవారి కాలాల్ను నిర్ణయించుకో. ఇప్పుడేం నీచరిత్రపు గోల సాగదూ?

నే తమరు చెప్పింది బాగుంది గాని దాన్నంతా అంగీకరించరుగదా?

చ అంతా అంటే? పాశ్చాత్య చారిత్రకులా? వారి అంగీకారం లాకపోతే యేం లోపం? ఎన్నిట్లో వాండ్లను సంతోషపెట్టాలని దేవుళ్లాడుతారు? అంతా అంటే, మన దేశంలో చారిత్రకులా? ఇప్పటిదాకా పాశ్చాత్యులవరవళ్లలో దిద్దుకొన్న వారు కొంచెం సణుగుతారుకాబోలు, వర్తమానాశ్రమ గంధం వదల్లాక అయ్యో, ఆ వాసన పోతుందేనని? సణగనీ, ఎంతకాలము సణుగుతారు? సణిగి సణిగి వాండ్లే మీదారి కొస్తారు. రామా? పోనీ మునిగిపోయిందా? వీండ్లనుగూడావాండ్లతో బొమ్మనండి!

నే. చిత్తం అయితే ఘా కల్లోలాల్ను గురించి చెప్పకుండా, నా సంకల్ప మీడేరుతుందాని?

చ ఎట్లా గీడేరుతుందయ్యా! చెప్పి, చెప్పకుండా చెప్పు! నీకు దగ్గ ల్నేర్పాలయ్యా!

నే: తమ అనుగ్రహానికి పాత్రుణ్ణి! ఎవర్నాహ్వానించనాని.

చ మాచాత జెప్పించి, నా కేం దెలుసు, దేవి చెప్పా రందామనా నీ యెత్తు? గట్టివాడవ్! మా కేం దలీదు, నీ తిప్పలు నీవు పడు. మా కుండ వీల్లేదు. నీ కావాల్సినవిషయం తేల్చాం గదా. మళ్లీ వస్తాంలే. [నిష్క్రమి]

నే: (ఆమె వెళ్లినదారి చూస్తూ) నమస్కారం గూడా అందుకోడాని కవకాశ మియ్యకుండా మళ్లీ వస్తామని వెళ్లారు! పయిగా నీ తిప్ప ల్నీవు పడమన్నారు! ఏం జేతునబ్బా? కొంచెం చిక్కేవచ్చిందే? (కొంత దీర్ఘాలోచనం నటించి) దీని కదే మార్గం సంగుల్నూ, కణ్వాయనుల్నూ వద్దు! వార్ని పిలుద్దాం, తర్వాత వాడ్నీ అటుపైవవార్ని, ఆ పైనవాణ్ణి పిలుద్దాం ఈ విధవ మ్లేచ్ఛగోల వస్తూంటే యెట్లాగబ్బా! అయినా చూద్దాం [నిష్క్రమి]

## శాతకర్ణి చక్రవర్తి

[గుంటూరు కిరవై రెండు మైళ్ళ దూరాన్నున్న అమరావతి: పండు వెన్నెల కాస్తూంది. శ్రీమదమరేశ్వరాలయానికి ఉత్తరాన కృష్ణాతీరం-ఆ తీరాన నొక దివ్యపురుషుడు తేజస్ఫురన్మూర్తి పచార్లు చేస్తూవుంటారు పండు వెన్నెట్లో. తమర్ని సమీపిస్తూన్న నన్నుచూచి—]

దివ్యపురుషుడు: ఏమయ్యా, యీ వెన్నెట్లో నిక్కడి కాహ్వానించావ్ అదీ యేదో ప్రాణంమీది కొచ్చినంత తొందరించావ్.

నేను నమోన్నమః తమరు శాతకర్ణి చక్రవర్తులేనా?

దివ్య. ఔ నయ్యో, నీ వుపాసించిం దేశాతకర్ణిని?

నే మహాప్రభో, తమరంతా ప్రపంచంలో నెవరికీ దిక్కుతోచనీకుండా వందమందికిపైనున్నారేమో ప్రభువులు, ప్రతివారూ శాతకర్ణీ అనో. శాలివాహనులనో బిరుదనామాల్ని వదలకుండా, ఎవ రెప్పటివారో తెలుసుకోడానికి లవలేశమైనా వీ ల్లాకుండా ధరిస్తే ఏ మహాత్ముణ్ణుపాసించేది. అందుకని వారికే మనమీద దయొచ్చి యెవర్నో ఒకర్ని పంపకపోతారా, చూద్దామని శాతకర్ణిచక్రవర్తీ, అని ఉపాసించా తమ రనుగ్రహించినందుకు కృతార్థుణ్ణి!

శాత ఊహూ, గడుసువాడవే! సరే, అట్లాగైతే మాపే రదైతే నీ కెందుగ్గాని, మమ్మల్నెందుకు పిల్చావో చెప్పు.

నే ఏం జెప్పను? ఒక పనికా? కొంత పెద్ద వ్యవహార ముండే శ్రమిచ్చా మొదట తమ ముఖపద్మంలో బ్రహ్మతేజ స్సగపడ్తూం దేమిటండీ?

శా మా మొగాల్లో మరో తేజ స్సెందు కగపడ్తుందోయ్ మేం బ్రాహ్మణులమని యెరగవ్.

నే అ దేమిటండీ, క్షత్రియులు గారూ?

శా మేం బ్రహ్మ క్షత్రియులం—అంటే క్షత్రియత్వం వహించిన బ్రాహ్మణులం.

నే అదేమండీ, కుమ్మరి

శా (వారించి) ఆపు. ఆకాలపు టాందోళనస్థితిలో మా పూర్వు లొక రొక కుమ్మరింట పెరగాల్సొచ్చింది. తర్వాత నా కృతజ్ఞతా సూచకంగా వా రా జాతి నభిమానిస్తే బయల్దేరిందా వాదు. అంతేగాని, మేం బ్రహ్మక్షత్రియులమే.

నే మొద టార్యమతస్థులై, తర్వాత బౌద్ధులైనారేమో!

శా అదీ పొరపాటే, అశోకమహారాజుగార్నన్నట్లే మమ్మల్నన్నారు. వారితరంలో పైతరంలో వచ్చిన ఆంధ్రచక్రవర్తులా మతాన్ని సామ్రాట్టిష్టాన్ననుసరించి పోషించడంచాత మేం బౌద్ధమతంవారని ప్రవాద మొచ్చింది. మా దెప్పుడూ ఆర్యమతమే

నే చిత్తం ఆశ్చర్యంగా వుంది. తమ రాజధాని చాలాచోట్లకు మారినట్లుందే?

శా ఆ—అవసరాన్నిపట్టి మార్చేవాండ్లం.

నే కొంచె మా మార్పులవిషయం సెలవిస్తారా.

శా గృధ్రవారవిషయంలో (గుడివాడ) గృధ్రహార సంహారానంతరం మా మూలపురుషుడాంధ్రవిష్ణువు మొదట శ్రీకాకుళంలో (చల్లపల్లిదగ్గర) రాజధాన్ని స్థాపించారు కొంతకాలానికి దాన్ని విజయవాడకు (బెజవాడకు) మార్చాల్సొచ్చింది మారాజ్య మింకా పశ్చిమానికి ప్రాకడంచేత దాని కొక విధంగా మధ్యగా వుంటుందని అమరావతికి మార్చాం. అప్పటికి పడమర నల్లమలవరకే యుండేది మా రాజ్యం. తర్వాత పశ్చిమసముద్రందాకా, ఉత్తరాన గోదావరిదాటిందాకా, వ్యాపించి మహారాష్ట్రాక్రమణ మారంభించేప్పటికి కల్యాననగరం రాజధానైంది అక్కడ్నుండి మాళవందాకా ప్రాకేప్పటకి ఉజ్జయినీనగరం రాజధానిగా నేర్పడ్డది తర్వాత వచ్చిన కల్లోలాల్లో మగధదేశాన్ని ఆక్రమించుకుని ఉత్తరాన నెపాళంవరకు [illegible] వరకు, తూర్పున హిమవంతంవరకు మా రాజ్యపు సరిహద్దులు వెళ్లడం చాతను, జయించిన రాజ్యానికి పాటలీపుత్రం రాజధానిగా వుండడం చాతను ఆ మహానగర మే రాజధానైంది. అయితే, పాతరాజధాన్లన్నీ శిబిరాలు కాలాంతంవరకు మండల రాజధాన్లయినాయ్.

నే చక్కగా బోధపడింది తమరు పాటలీపుత్రంలో రాజధాని నేర్పరచేవర కెంతకాలం బట్టిందండీ?

శా అక్కడక్కడ చిల్లర రాజ్యాల కేం, తర్వాత చాలాకాలందాకా వున్నాయ్ శ్రీకాకుళంనుండి హిమవంతందాకా మా సామ్రాజ్యం వ్యాపించడానికి రెండువందలసంవత్సరాలైయుంటుంది పాటలీపుత్రమం దొక వందయేండ్లు పాలించుంటాం దేశాన్ని మొత్తానికి మా సామ్రాజ్యం కొద్దిగానో, గొప్పగానో షుమారు మూడువందల సంవత్సరాలు నడిచింది.

నే చిత్తం, తమకు మౌర్యభృత్యు లనే బిరు దుంది గదండీ!

శా మాకే నేమోయ్ మాముందు పాటలీపుత్రా న్నేలిన కణ్వాయనులు మౌర్యభృత్యులే, వారికి ముందందు డేలిన సంగవంశం వారు మౌర్యభృత్యులే. ఆ మహాసామ్రాజ్యాధిపతులకు భృత్యులు కానివా రెవరు? వారు మహానుభావులు.

నే సంగవంశపురాజులు మౌర్యభృత్యులైతే వారి మొదటి రాజైన పుష్యమిత్ర సంగుడు చివరిమౌర్యరాజును సంహరించిరాజైనా రంటుందే పురాణం, అంత అవిశ్వాసప్పని నెట్లా చేసారండీ వారు?

శా. నీవు మళ్లీమళ్లీ అడక్కుండా ఆ కథ చెప్తాం విను. అశోకమహారాజుగారి అనంతరం వచ్చిన మౌర్యరాజులు వ్యర్థులు. సమర్థుల స్థానే వ్యర్థు లావడంతోనే వార్ని మార్చే ప్రయత్నాలు సమర్థులైన సామంతరాజుల్లో, సేనాధిపుల్లో చేస్తూవుంటారు. అది రాజ్యక్షేమంకొర కేర్పడ్డ ఆచారం. దానికి ఆ మౌర్యుల రాజనీతి తోడైంది. సామర్థ్యం లాకపోయినా అన్ని విషయాల్లో అశోకనీతిని పాలించిన వారి వారసులు, వారి మతనీతిని పాలించలా వారు బౌద్ధమతాన్నం తభిమానించినా, అన్యమతాన్ని గౌరవపరచకుండా వాటిమీద నభిమానమున్న ప్రజలు ఆ మతధర్మాల్ను చెడకుండా పట్టుకొచ్చే పరిపాలనాక్రమాన్ని నడిపారు. వీరు బౌద్ధమతంపట్ల పూర్ణాభిమానం వహించి ఆర్యధర్మాల్ను బాహాటంగా నిరసించడ మారంభించారు. ఎంతవర కొచ్చిం దంటే, యుద్ధమంటే "అహింసా పరమో ధర్మా"ని ప్రజలు జపించే స్థితి కొచ్చింది. ఇది ఆర్యమతాభిమానులకు కంటకమైంది. మావలె సంగులు, కణ్వులు బ్రాహ్మణ ప్రభువులే వారి కాస్థితి దుర్భరమై యిర్వురూ కలిసి చివరమౌర్యుణ్ణి వధించి పెద్దవాడైన సంగునకు రాజ్యమిచ్చారు వారివారసులూ కొద్దికాలంలో మౌర్యరాజులకుమల్లేనే మారితే కణ్వుడూ ఆపనే చేసి రాజైనారు. మే మా రెండు పన్లూ జరిగినపు డామోదించి వారికి సామంతులుగానే అన్నాం. ఉంటూండగా కణ్వప్రభుల్లో చివరవాడసమర్థుడుగావడం, అప్పుడే శాక్యులనే జాతివాండ్లు హిమవంతం దాటబోతున్నారనే వదంతి మేము వినడం

(18 వ పేజీ చూడుదు)


### నెరసిన వెంట్రుకల ఔషధము

రంగుపూయనక్కరలేదు. ఆయుర్వేదచికిత్స తెల్లని రంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసుచేయబడును. తెలుపు కొంచెమై యుండిన రూ 2-8-0 మధ్యరకమై యుండిన రూ 3-8-0 పూర్తిగాయుండిన రూ 5-0-0.

గమనింపు:— ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

**Kesh Ranjan Aushadhalaya,**
**M. 63. P. O. Raniganj (Burdwan).**

# శాతకర్ణిచక్రవర్తి

(10 వ పేజీ తరువాయి)

తటస్థించింది మన మాసంగ కణ్వనీతి ననుసరించకుంటే దేశం క్రూరులైన విదేశీయుల పాలవుతుంది, ఆర్యధర్మాలు నశిస్తా యని మాకు భయం తోచి, మాలో కుంతలశాతకర్ణి చివరి కణ్వుణ్ణి వధించి పాటలీపుత్రాన్నాక్రమించుకుని పాలించడ మారంభించాడు మేం చివరదాకా మౌర్యభృత్యబిరుదాన్ని మటుకు వదలలా. మౌర్య అంటే, చంద్రగుప్త, బిందుసార, అశోకమహారాజుల భృత్యుల మన్న మాట.

నే కటాక్షం, మహాప్రభో — ఈమాత్ర మెవరూ మాకు చరిత్రను విరళంజేసిన పాపాన బోలా! తర్వాత—తమ రిప్పుడు సెలవిచ్చిన శాక్యులనేవాం డ్లెవండ్లు, ఎక్కడ్నుంచి వచ్చారండీ?

శా. వాళ్ల పూర్వచరిత్ర మనకు సరిగ్గా తెలీదు, కాని వారు చీనాదేశ పశ్చిమప్రాంతాన్నుండి వచ్చారని తెలుసు. వారికీ, వారికక్కడ కొంచె ముత్తరంగా నున్న హూణు లనే జాతి వారికీ వైరం తటస్థించింది. శాక్యరాజు హూణ రాజును చంపి, అతని శరీరం కత్తి కొక కండగా గోయించి నాల్గు దిక్కులకు విదజల్లించాడు హూణరాజు కొంతి కాలానికి శాక్యరాజును చంపి అతని రక్తాన్ని అతని పుర్రెనిండా పోయించి త్రాగాడు. వారి రాజు లాలాటి నీతిమంతులు వారి మత మేదీలేదు. కత్తి స్నేలలో బాతి దానిచుట్టూ ప్రదక్షిణా ల్జేసి-నమస్కరించడమే వారి మతం ఇక వాళ్ల ప్రజలు రాక్షులవలె క్రూరులే. ఎక్కడికన్నా బయల్దేరితే పెండ్లాం బిడ్డల్తో గొడ్డుగోదలతో బయల్దేరడం, విడిసిన చోట తమ బండ్ల నొకకోటఆవరణంలాగా పెట్టడం, ఆడవాండ్లను ఆ ఆవరణాల్లో నుంచడం, మగాళ్లు మీదికొచ్చినవాండ్లతో యుద్ధాల్జేయడం, చెరజిక్కినవాం డ్లందరిని సంహరించడం యిదీ వారిపద్ధతి. వాండ్లకు రాజులు, జాత్యధికారానికి కులపెద్దలు తెగల అధికారానికి యేర్పడి వుంటారు. వాండ్లలోనూ ఎవడు మహా శూరుడైతే వాడే రాజూ, కులపెద్దా! అట్లాటి వాండ్లూ వాండ్లు.

పై హూణుల వైరాని కాగలేక వాండ్లు పశ్చిమమార్గంగా వచ్చి వచ్చి కొన్నేండ్లకు గాంధారానికి(ఆఫ్‌గనిస్థాను) ఉత్తరా నున్న పర్వతాల్ను దాటి, దక్షిణభూభాగాన్నంతా ఆక్రమించుకుని,—ఇదంతా ముప్పైయేండ్లు పట్టుంటుంది షుమారు. రెండు తెగలుగా ఒక తెగ ఉత్తరపు కనుమగుండా, మరొక తెగ దక్షిణపు కనుమగుండా సింధులోయలో ప్రవేశించి దాన్నంతా పూర్తిగా నాక్రమించుకుని మనకు విపరీతమైన యెద్దడిని, నాటికి పూర్వం మనదేశ మెన్నడూ ఎరగని యెద్దడిని కలిగించారు.

నే: వాండ్ల న్నిరోధించే యత్నా లేం జరిగాయండీ?

శా: కణ్వులశక్తులని గుర్తించి మేం వాండ్ల న్తొలగించి సామ్రాజ్యా న్నాక్రమించుకున్నాం. కొంతకాలం పెనుగులాడి ఉత్తరపు తెగధాటి దుర్భర మైతే వింధ్య కుత్తరా నున్న రాజ్యాన్ని విడిచి దక్షిణాన ఉజ్జయినిలో జేరాం. మన పుణ్యమాని వాండ్లు కాశీ దాటి రాజాలని బాధలు వాండ్ల కుత్తరాన కలిగాయి. అప్పుడు మేం విడిచిన భాగంలో చిల్లర రాజులు రాజ్యాల్ను స్థాంచుకు పాలించడ మారంభించారు. ఈ విషయం నీవు మళ్ళీ అడక్కుండా జెప్పాం. ఉజ్జయినీ చేరింతర్వాత ఆ రెండు తెగలవారు కలిసి మామీది కొచ్చారు. అప్పుడు రాజ్య మేల్తున్న శాలివాహనచక్రవర్తికీ వారికీ ఒక మహాసంగ్రామం జరిగింది. దాన్లో నా చక్రవర్తి అంతక్రిత మే ఆర్యప్రభువూ చేయని శత్రుసంహారం జేసారు. ఆ మహాకార్యజ్ఞాపక చిహ్నంగా నాట్నుండీ యుధిష్ఠిరశకా న్నాపి శాలివాహనశకాన్ని ప్రారంభించారు.

నే చిత్తం. ఆ చక్రవర్తివరో తమపేరు పెట్టకోకుండా ఎన్నడో ఆంధ్రంలో రాజ్య మేలిన శాలివాహనుని పేర శక మారంభించా రేమండీ?

శా. (నవ్వి) మీదంతా మాకు విచిత్రంగా వుంటుంది. మనకు పెద్ద లుండగా పిన్నల పేర్లు పెట్టుకునే ఆచార ముందా? కుటుంబంలో నే జరిగినా వర్తమానతరంలో కుటుంబపు పెద్దపేరే నేటికీ జరుగుతూం దనుకుంటాం రాజ్యవిషయాల్లో పేరుబడ్డ ప్రథమమూలపురుషుడి పేర జరుగుతుంది. అసలు శకాలు ప్రజల్నిర్ణయించేవి కాని, ప్రభువులు సాగించేవి కావు. యుధిష్ఠిర శకం యుధిష్ఠిరులవారి మీద ప్రేమభక్తిచాత నాటి ప్రజలు సాగించారు శాలివాహనులవారి మీ దన్న ప్రేమభక్తిచేతి అప్పటి ప్రజలు సాగించారు.

నే చిత్తం. మావాం డ్లీ స్వల్పవిషయాన్ని యెంతో గంద్రగోళంగా వాదించి వాదించి దాన్నిగురించి యేమీ తేల్చకుండా మమ్మల్ని వేధిస్తున్నారు. చిత్తం. కృతార్థుణ్ణి. ఆంధ్ర చక్రవర్తులకాలంలో మన సంఘ మెట్లా గుండే దండీ?

శా ఏమిటోయ్, విపరీతప్రశ్న! మన సంఘ మెట్లా గుండే దేమిటి? మనసంఘంలా గుండేది

నే అదేమయ్యా, అట్లా సెలవిస్తారు! చాతుర్వర్ణ్యాలెట్లా గుండేవి, పంచమవర్ణ మెట్లా గుండేది, పరమతస్థు లెట్లా గుండేవారు, వారికి వారికీ ఏలాటి సంబంధ ముండేది?

శా అదా నీకోరికా! ఎట్లా గుండే దంటే, యేమి టోన నుకున్నాం. చాతుర్వర్ణ్యాలు మామూలుగానే వుండేవి కాని, యెక్కడో శ్రోత్రియులకు, నియమవంతులకు తప్ప అన్యోన్యం పైమూడుజాతులకు వివాహాది సంబంధా లుండేవి ఆ నియమవంతులకైనా యింట్లో వంటవగైరా విషయాల్లో చిక్కువల్ల తప్ప అట్లాటి సంబంధాలు నిషేధాలు కావు శూద్రజాతిల్లో పలు తెగలు బయల్దేరాయి. పంచమవర్ణం రానురాను బాహుళ్య మౌతూం డేది వ్రాత్యత్వంవల్ల, సంఘసేవాభిలాష వల్ల. అనగా నిషేధసంబంధసంజాతులు, గత్తర్లలో సంఘంకోసం కృషిసల్పిన ఉత్సాహవంతులూ నాజాతిలో జేర్తుండే వాండ్లు. పైవాండ్లంతా ఆర్యమతస్థులే; వాండ్లే దేశంలో బహు సంఖ్యాకులు. బౌద్ధజైన మతస్థులు రాజాశ్రయాలవల్ల కొంతకాలం తక్కడక్కడా ప్రబలి వుండేవారు కాని, ప్రబలులై వుండేవారు కారు. విదేశీయులు కొందరొచ్చి నివాసా లేర్పరచుకుని యెవరితో గలియకుండా వుండేవాండ్లు. మరచి పోయినాం, శాక్యుల్లో కొందరు మన మతా ల్నవలంబించి ప్రత్యేకపు తెగలుగా నేర్పడుండేవారు.

నే. ప్రభువుల కేమతంపట్లనైనా, పక్షపాత బుద్ధుండేదాండి?

శా: నీ ప్రశ్నలు కొన్ని మాకు నవ్వొస్తాయ్. పక్షపాతబు ద్ధుంటే ప్రభుత్వాని కేం పనికొస్తాడోయ్ రాజు? రాజాభిమానాన్ని పక్షపాతంగా పరిగణిస్తా రనుచరులు, అభిమానం పొందినవారు, పొందనివారు, అయ్యో, పాప మని అభిమానించారేమోనని అనుకోకుండా. ఆ విమర్శ ఎప్పుడు సమంజస మౌతుందంటే, మిగతా వాండ్లను నిరాపించినపుడు. అట్లా గాకుండా అందరినీ సమబుద్ధితో చూస్తూంటే అవా డెట్లా గొస్తుంది. అంటే, మేం రాజులు మనుష్యులు కారు, దేవత లనడంలా. వాండ్లలో మానవ స్వభావంచాత కొంద రవ్యక్తంగా పక్షం వహించొచ్చు. అది తప్పని మేం జెప్పక్కర్లా! అట్లా చేసినవాండ్లు పట్టుపడి తగిన బాధనుభవించి తీర్తారు. ఏ సూత్రం చెప్పినా సాధారణవ్యవహారానికే. సాధారణంగా ప్రభువులు పక్షపాతులు గారు. దీన్నంతా గమనించకుండా అందర్నీ కన్నబిడ్డలకు మల్లే కనిపెట్టిన అశోకమహారాజంతవార్ని “అయ్యోపాపం, బుద్ధుడి సిద్ధాంతాభిమానులు మటుకు మన ప్రజలు కారాని” వారి నభిమానించారని “ఆయనకు బౌద్ధులంటే ప్రేమా, ఆర్యమతస్థులంటే నిరసనా” అని అనేక వెర్రివాదులేసి, వారి కీర్తిని చెడగొట్టా రవతల వచ్చినవారు. ఇదంతా వివేకమార్గం గాదు.

నే· చిత్తం: దేశం సుభిక్షంగా వుండే దాండి?

శా. ఆ ప్రశ్నెందుకు? మన దేశ మట్లా గుండడం, దెప్పుడెన్నడో యేభాగమో తప్ప? ఎంత సుభిక్షంగా వుండకపోతే ఓడవ్యాపారాలు సాగేవా? మాకాలంలో నెంత వ్యాపార ముండేది, వర్తకు లెన్నివేల మైళ్ల దూరానున్న దేశాలకు మన సరుకు ల్లారేసి అక్కడివి మన గ్గావాల్సినవి తెచ్చేవారు కారు? ఒకటిమటుకు గమనించు—విదేశాల్లో మన అమ్మక మెక్కువుండేది, మన కొనుగోలు తక్కువుండేది ఇక్కణ్ణుంచిసరుకు వెళ్లేది, అక్కడ్నుంచి వెండీ బంగారం వచ్చేవి. వర్తకులు కోటికిపడగులు తేలిగ్గా యెత్తేవారు.

నే అ దెందుకండీ ఆ ఆచారం?

శా అ దెరగనే యెరగవోయ్? వర్తకం జాగ్రత్తగా సాగితే గదా అట్లాటి లాభాలొచ్చేది? దానికి ప్రభురక్షణ—అంటే ప్రజారక్షణే—అక్కర్లా? అంతలాభ మొస్తే వర్తకుడు రాజ్యావసరాలకు, అంటే ప్రజాక్షేమాని, కేమీ యియ్యనక్కర్లా? అది ప్రభుత్వంవారు వేగులవాండ్లద్వారా కనుక్కొని అడక్కుండా, వర్తకులే ఏమీ దాచకుండా, కోటి కాగానే పడ గెత్తేవా రింటిమీద, కొట్టుమీదా. వాట్ని చూచి రాజాధికారు లెల్లి తమకు రావలసిన మొత్తాల్ను తెచ్చి కోశాగారంలో చెల్లించేవారు వర్తకుల మనుష్యు లెదుట

నే· అహా యేం కాలం మహాప్రభూ! మాకాలంలో వర్తకు లున్నా, లే దంటూంటారు.

శా. సరే, మీ ప్రభువులు, వారి అధికార్లు ఎట్లా వాండ్లో! ప్రపంచంలో మన మొకర్ని నమ్మితే, వాండ్లు మనల్ని నమ్ముతారు. దుర్మార్గు లెప్పుడూ వుంటారు.

నే· దక్షిణాన తమరాజ్యం కన్యాకుమారి దాకా వెళ్లిందాండి?

శా: తేలిగ్గా వెళ్లేదేగాని మే మెన్నడూ కృష్ణదాటి దక్షిణాని కెళ్లదలచుకోలా. అక్కడి ప్రభువులే అప్పుడప్పుడు మేము యశోవంతుల మని, శీతనగపర్యంతం సామ్రాజ్యం కట్టినవార మని మాకు బహుమతులు పంపేవారు. మేం వారి రాయబారులును దగినట్లు బహూకరించే వాండ్లం. వారు ధర్మపరాయణులని, శాంత మూర్తులని మా వేగులవల్ల విని మేం వారిజోలి కెళ్లేవాండ్లం గాము. వారు మంచివారు, చక్కని పరిపాలనాక్రమంతో రాజ్యం జేసే వారు. అన్నివిధాలా బుద్ధిమంతులు.

నే. తమరు సెలవిచ్చిన అంతకూ కృతజ్ఞుణ్ణి.

శా: సరే, ఇక వెళ్తా, మింద్రసభ కెళ్లాల్సిన పనుంది. నీ కెప్పు డవసరమని తోస్తే అప్పుడు పిలు, వస్తాం.

నే: నమస్కారం!

శా: బ్రహార్పణ మస్తు! (నిష్క్రమి)

---



# గ్రంథ పరిచయం

## అహింసా జ్యోతి

ప్రాప్తిస్థానము విశ్వసాహితి, అరండల్ పేట, గుంటూరు. మూల్యం రు 1-4-0

బాపూజీకి, ద్వితీయ స్వాతంత్ర దినంనాడు ఆంధ్ర కవికుమారులు కావ్యనీరాజనం పట్టారు అదే ఈ “అహింసాజ్యోతి” కావ్యం వివిధ కవుల ఆవేదనను ప్రదర్శిస్తున్నా, భావాలు మాత్రం వివిధాలు కాలేకపోయాయి అయితే సాధారణంగా రాజకీయ నాయకులు ప్రకటిస్తున్న భావాలకంటె కవుల భావాలు విశిష్టంగా ఉండాలని కోరటం అసహజం కాదు. కొందరు రాజకీయవాదులు “ఒక హిందువు గాంధీజీని హత్యచేయటం మనకు సిగ్గుచేటు” అని అహంభావ ప్రకటనలు చేస్తూ ఉంటారు కాని కవి మాత్రం సత్యాన్వేషణపరుడు. బాపూజీ నిర్యాణానికి కొన్ని అమానుషరాజకీయాల పరస్పర సంపర్కఫలితంగా ఉద్భవించిన ఒక ప్రమాద శక్తి మూలకారణం. హంతకుడు నిమిత్తమాత్రుడు మాత్రమే దేశరక్షణబాధ్యతవహించిన నెహ్రూ, పటేళ్లు, ఈ “సత్యసహకారముచిట్టచిటారు కొమ్మపై పండిన పండు”ను కాపాడలేక పోయాముకదా అనే విచారంతో క్రుంగిపోయి, “పెద్దదిక్కు”ను చంపుకున్నామని విలపించారు. అంతే. నెహ్రూ పటేళ్లుగాని, మరెవ్వరుకాని, బాపూజీ క్షేమాన్ని కోరినవా రెవ్వరూ, ఈ హత్యకు బాధ్యులు కారు—వారు సిగ్గుపడాల్సిన అవసరం కన్పడదు. గాంధీజీ హత్యలో భారతీయుల మానవత్వం పోయిందనికాని, హత్యయే ఆయనకు హైందవు లిచ్చిన కానుకయనిగాని, భరతభూమి పాపం పులుముకున్నదనిగాని, మానవజాతికే నీతి లేదనిగాని, మన పని నగుబాటయిందనికాని, మనము గాంధీజీని శిక్షించినామనిగాని, చివరకు “భారతావని స్వీయ జీవితాశ్వాసములో లిఖించుకొనసాగునటే ( దుశ్చరిత్రముగ్” అనిగాని అనుకోటం, అనవసరమైన అతిశయోక్తి మాత్రమే అవుతుంది. అంతకంటె, ఆయన “దుర్జరాభారరుగ్భావం బించుకలేని వీరజనయోగ్యంబైన” మృతిని పొందాడని, భవిష్యత్తులో మన “కాలమువారు పన్యులని ఆడిపాడు” తారు అని అనటం కొంత సత్యం కర్తవ్యతావిమూఢులైన ప్రజలకు, సత్యస్థితిని తెల్పి, కర్తవ్యప్రబోధాన్ని చేసే బాధ్యత కవులది “అహింసాజ్యోతి” అట్టి బాధ్యతనే వహిస్తే ఎంతో బాగుండేది

“కృష్ణ”

## తెలంగాణా వీరగాధలు

(ఆరు కథల పూజాకుసుమం) ప్రకులకు; సారథి కార్యాలయం, గవర్నరుపేట, విజయవాడ. వెల అర్ధరూపాయి

ఈ సంపుటంలో, వివిధ రచయితల కథలు తెలంగాణా వీరుల వీరత్వాన్ని వర్ణిస్తూ వ్రాసినవి, ఆరు కథ లున్నాయి. కథలన్నీ చకచకా చదివించే కథలుగా ఉన్నాయి. జర్మన్ రష్యన్ యుద్ధసమయంలోనూ యుద్ధానంతరమూ, బయలుదెరిన రష్యన్ కథలను తలపించే టట్లుగా ఉన్నయి. “జైలు గోడలమధ్య” అపరమోహిని అన్నికథలు, కథావస్తువునే కాక కథన విధానంకూడా ఎక్కువ దృష్టిలో ఉంచుకొని రచించినవి. మత్తు బెట్టు కూలిం డి అన్నకథలో, ఒక చక్కని వాస్తవిక మనస్తత్వ పరిణామరూపాన్ని వస్తువుగా రచయిత తీసికొన్నాడు. కాని శిల్పము విషయంలో కూడా మరికొంచెం శ్రద్ధ వహించిఉంటే బాగుండే దనిపిస్తుంది. రచయితలు అందరూకూడా శిల్పుకన్నా, కథావస్తువు యాథార్థ్యముపై దృష్టి నిగుడించవలెననే సత్యతత్త్వంవారు. రచయిత తవ బుజుత్వాన్ని వదులుకోనక్కరలేకుండా, చదువరి మనస్సులో ఈ యాథార్థ్యభ్రమ, తదనుకూలమైన ఉద్విగ్నభావాలు, కల్పించేందుకు శిల్పాన్నికూడా తోడుచేసుకొంటేనే, ఇంతకన్న బాగా కళ ప్రజకు ఒప్పించవచ్చునేమో అనిపిస్తుంది. కాని ఉన్నంతలోనే కథలలోని వాస్తవిక బలంవల్లనే, కథలు రమ్యంగా ఉన్నవి గేయాక్ష కూడా చక్కగా నడిచినయి

## మహాంధ్ర

మాసపత్రిక, సంపాదకులు శ్రీ యుతులు పాలగుమ్మి పద్మరాజు నండూరి రామకృష్ణమాచార్య. వెల రు 0-4-0,

సంపాదకులు స్వశక్తిపై ఆధారపడి, ఈ పత్రికను దేశంలోని సంస్కారు లందరికీ ఒరవడిగా చేయాలని ఆశిస్తున్నట్లు పత్రిక వెల్లడిస్తోంది. పత్రికలో ప్రసిద్ధులయిన రచయితల రచనలు ఉన్నాయి. పత్రిక రాను రాను జయప్రదంగా కాగల సూచనలన్నీ ఉన్నాయి. పత్రిక జయప్రదమగుగాక అని కోరుతున్నాము.